RNI NO.APTELU/2012/53127 TELANGANA VANI TELUGU DAILY
తెలంగాణ వాణి
తెలుగు దినపత్రిక
The Voice of Telangana
మంగళవారం, సెప్టెంబర్ 1, 2026

గిరిజన బిడ్డ శిరీష కుటుంబానికి న్యాయం చేయాలి

- కొత్తగూడెంలో కొవ్వొత్తుల ర్యాలీ..

నిందితులకు కఠిన శిక్ష విధించాలని డిమాండ్

కొత్తగూడెం, ఆగస్టు 31 (తెలంగాణ వాణి):
ఆదివాసీ యువతి ఊకే శిరీషపై లైంగిక దాడికి పాల్పడి హత్య చేసిన ఘటనపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ కొత్తగూడెంలో సోమవారం కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. వైద్యులు, నర్సింగ్ సిబ్బంది, విద్యార్థులు, మహిళలు, యువత, ప్రజలు 'జస్టిస్ ఫర్ శిరీష' బ్యానర్‌తో ర్యాలీలో పాల్గొన్నారు. ములకలపల్లి మండలం చౌటిగూడెం కాలనీకి చెందిన శిరీష హైదరాబాద్ శివారు తుక్కుగూడలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో నర్సుగా పనిచేస్తున్న సమయంలో దారుణ హత్యకు గురైన విషయం తెలిసిందే. ఈ ఘటనకు బాధ్యులైన నిందితులను గుర్తించి, ఎట్టి పరిస్థితుల్లోనూ వదలకుండా కఠినంగా శిక్షించాలని ర్యాలీలో పాల్గొన్న వారు డిమాండ్ చేశారు. కొవ్వొత్తులు చేతబట్టి పట్టణంలోని ప్రధాన రహదారుల మీదుగా ర్యాలీ నిర్వహించి శిరీషకు నివాళు లర్పించారు. మహిళల భద్రతకు ప్రభుత్వం మరింత పటిష్ట

చర్యలు చేపట్టాలని, ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా కఠిన చట్టాలను అమలు చేయాలని కోరారు. బాధిత కుటుంబాన్ని రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే ఆదుకుని, వారికి న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాజు, సంపత్, సాయి, విక్రమ్, విజయ్, సోను, కరిష్మా, సునీత, స్పందన, మౌనిక, లక్ష్మి, సఫియా తదితరులు పాల్గొన్నారు.